హైదరాబాద్ వార్త



నాసీరకం డబ్బాలతో సరఫరా

బీఐఎస్ ప్రమాణాల ప్రకారం నీటిని నింపే డబ్బాలు, క్యాన్లు పాలిథిన్,పాలి వినైల్ క్లోరైడ్, పాలి ప్రొపిలిన్‌తో తయారైన వాటినే వినియోగించాలి. కానీ ధర ఎక్కువవుతుందనే కారణంతో నాసీరకం డబ్బాలలో నీటిని సరఫరా చేస్తున్నారు. ఈతరహా ప్లాస్టిక్ బాటిల్స్‌లో బ్యాక్టీరియా త్వరగా వృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందని వైద్యులు తెలుపుతున్నారు. పునర్వినియోగించే ప్లాస్టిక్ డబ్బాలను బీపీఏ ఫ్రీ ప్లాస్టిక్‌తో తయారు చేయాలి. ఇవన్నీ తెలియని వినియోగదారులు నీటిపేరుతో అనారోగ్యాన్ని కొనుగోలు చేస్తున్నారని అంటున్నారు.



# నీళ్ల వ్యాపారంపై తనిఖీలేవి..?

**పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వాటర్‌ప్లాంట్లు**

**మినరల్ వాటర్ పేరుతో కోట్లలో దందా**

**బోరు నీటినే ప్యూరిఫైడ్ చేసి విక్రయిస్తున్న వ్యాపారులు**

**నాణ్యతలేమితో ప్రజారోగ్యంతో చెలగాటం**

**చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం**

హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త: వేసవి వచ్చిందంటే చాలు నగరంలో మినరల్‌వాటర్ పేరుతో కోట్లలో వ్యాపారం జరుగుతోంది. అయితే మినరల్ వాటర్ పేరు చెప్పి అమ్మకాలు చేసే నీటిలో మినరల్స్ మాట దేవుడెరుగు కనీసం తాగ డానికి పనికొచ్చేపరిస్థితి కూడా లేదని నిపుణులు చెబుతున్నారు. కేవలం బోరు నీటిని ప్యూరిఫయర్ల ద్వారా శుద్ధిచేసి విక్రయాలు జరుపుతున్నారు. ప్యూరిఫయర్ల ద్వారా నీటిలో ఉండే బ్యాక్టీరియా తొలిగిపోదని అధికారులు చెబుతున్నారు. అయినా వాటినే ఎంచక్కా అమ్మేస్తున్నారు. నగరంలో వివిధ రకాల పేర్లతో ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్(దీనిని కొందరు తయారీ దారులు మినరల్ వాటర్ అంటున్నారు)ను విక్రయిస్తున్నారు. వీటిలో నాణ్యత లేకపోవడంతో డయేరియా,జాండీస్ వంటి ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం పొంచిఉంది. వేసవి కాలంలో ఒక్క హైదరాబాద్ నగంలోనే రోజుకు దాదాపు 7కోట్ల నీటివ్యాపారం జరుగుతున్నట్లు అంచనా వేస్తున్నారు. నగరశివారు ప్రాంతాలైన చర్లపల్లి,మల్లాపూర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, కాటేదాన్,రాజేంద్రనగర్, హయత్‌నగర్, వనస్థలిపురం, మియాపూర్ తదితర ప్రాంతాల్లో రోజురోజుకూ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఇప్పటివరకు గ్రేటర్‌లో సుమారు 2వేలకు పైగా వాటర్‌ప్లాంట్‌లు కొనసాగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మినరల్ వాటర్ పేరుతో మార్కెట్లో లభించే నాణ్యత లేని బాటిల్ వాటర్‌ను తాగడం వల్ల వివిధ రకాల వ్యాధుల బారిన పడే అవకాశం అధికంగా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కాలుష్యపు నీటితోనే అధికశాతం వ్యాధులు వస్తున్నాయని తెలుపుతున్నారు. పైకి స్వచ్ఛతతో ఉన్నట్లు కనిపించినా అందులో బాక్టీరియా ఉంటున్నట్లు ఐపీఎం అధికారులు పరీక్షల్లో స్పష్టమవుతోంది. ఇటువంటి నీటిని తాగడం వల్ల ఎసిడిటీ సమస్యలు డయేరియా, జాండీస్ వంటివి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అధిక శాతం ప్లాంట్‌లు బోరునీటినే వినియోగిస్తున్న నేపథ్యంలో అందులో ఫ్లోరైడ్ పాళ్లకూడా కనిపిస్తుననట్లు తెలుపుతున్నారు. నిర్ణీత ప్రమాణాల కంటే ఫ్లోరైడ్ అధికంగా ఉన్నా ప్రమాదమే..లీటర్ నీటిలో 1మిల్లీ గ్రాము కంటే తక్కువగా ఉండాలి. కానీ ప్రస్తుతం మార్కెట్లో విక్రయించే నీటిలో ఇవేవీ ప్రమాణాలకు సరిపోయేంత ఉండటంలేదని అంటున్నారు.



**పాటించాల్సిన నిబంధనలు..** నిజంగా ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలంటే తప్పని సరిగా బీఐఎస్‌నుండి లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. తయారు చేసే కంపెనీ చిరునామా ఏపద్దతిలో నీటిని శుద్ధిచేస్తున్నారన్న దానిని కచ్చితంగా ప్యాకింగ్‌పై ముద్రించాల్సి ఉంటుంది. నీటిని నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా శుద్ధి చేయాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే సుమారు 30లక్షల ఖర్చు అవుతుంది. కానీ కేవలం 3-4లక్షల ఖర్చుతోనే వీటిని ఏర్పాటు చేస్తున్నారు. బీఎస్ఐ లైసెన్స్‌గల వాటర్ ప్లాంట్‌లో అధికారులు నెలకు కనీసం రెండుసార్లైనా తనిఖీలు నిర్వహించాలి. నీటిని శుద్ధి చేసే యంత్రాలు, విశాలమైన గదులు, ల్యాబ్ టెక్నీషియన్లు, మైక్రోబయాలజిస్ట్‌లను సమకూర్చుకోవాలి.

**పత్తాలేని అధికార యంత్రాంగం..** ప్రజారోగ్యంతో ముడపడి ఉన్న నీళ్లవ్యాపారంపై తరుచూ తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు కాసులకు దాసోహమై ప్రజల ప్రాణాలనే ఫణంగా పెడుతున్నారు. అక్రమ దారిలో ప్లాంట్ల యాజమాన్యాలు ఎరవేసే డబ్బులకు కక్కుర్తిపడి అటువైపు చూడకుండానే అన్నీ సక్రమంగా ఉన్నాయంటూ చేతులు దులుపుకుంటుండటంతో ప్రజలు రోగాలపాలవుతున్నారు. ఇబ్బడిముబ్బడిగా అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన నీటిప్లాంట అను తనిఖీ చేసి వాటి ఆట కట్టించాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కుటుంబ కలహాలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

**కుళ్లిపోయిన మృతదేహం**

అల్వాల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: కుటుంబ కలహాలతో భార్యతో విడిగా ఉంటూ.. జీవితంపై విరక్తి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలోని హస్మత్‌పేట్‌లో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి పోలీసులు బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హస్మత్‌పేట్‌లో నివసించే నల్లవలి రంగయ్య సత్యపాలన్ గత ఏడాది అక్టోబర్ నెలలో ఉద్యోగం రీత్యా అమెరికాకు వెళ్లారు. అతని కొడుకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన నల్లపల్లి చేతన్(39) హస్మత్‌పేట్‌లోని ఇంటిలో ఒంటరిగా ఉంటున్నాడు. భార్యతో కలహాలతో ఆమెకు ఆరు నెలలు నుంచి దూరంగా ఉంటున్నాడు. గత ఏడాది అక్టోబర్‌లో అమెరికాకు వెళ్లి ఈ నెల 12వ తేదీన ఉదయం 4.30 గంటలకు సత్యపాలన్ ఇంటికి తిరిగి వచ్చాడు. కాలింగ్ బెల్ కొట్టినా కుమారుడి నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. అలిసి కొడుకు నిద్రిస్తున్నాడని భావించిన ఆయన అదనపు తాళంతో తలుపులు తెరుచుకుని లోపలికి వెళ్లాడు. కుళ్లి పురుగులు పట్టిన స్థితిలో కొడుకు శవం చూసి కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. కొడుకు మరణానికి సంబంధించి ఎటువంటి అనుమానాలు లేవని భార్యతో ఉన్న వైరుధ్యంతోనే మానసికంగా ఇబ్బందులు పడుతున్నాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కుళ్లిపోయి పురుగులు పట్టిన స్థితిలో చేతన్ శవం ఉండడంతో ఆత్మహత్యకు పాల్పడి పది రోజులై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

## మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు

**అడిషనల్ డిజిపి శిఖా గోయల్**



హైదరాబాద్, ఏప్రిల్ 12,ప్రభాతవార్త: రాష్ట్రంలో మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అడిషనల్ డిజిపి (ఉమెన్స్ సేఫ్టీ, షీటీమ్స్, భరోసా ) శిఖా గోయల్ అన్నారు. ఈమేరకు బుధవారం గచ్చిబౌలిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిస్క్ మేనేజ్‌మెంట్‌లో లీడర్‌షిప్ ఎక్సలెన్స్ -విద్యార్థుల కోసం ఇంటరాక్టివ్ సెషన్‌ను నిర్వహించారు. దీనికి శిఖాగోయల్ ముఖ్యఅతిధిగా హాజరై మహిళలకు భద్రతకు సంబంధించిన వివిధ అంశాలు, వారికి సహాయపడే చట్టాలు, షీటీమ్స్‌ల పాత్ర గురించి సుదీర్ఘంగా వివరించారు. అలాగే విద్యార్థులు ఆమె జీవిత సమతుల్యత, సివిల్ సర్వీస్ కోసం సన్నద్ధత మొదలైన వాటి గురించి అనేక ప్రశ్నలు అడగగా తను ఈస్థాయికి రావడానికి గల కారణాలను వివరించి విద్యార్థుల్లో శక్తిని నింపారు. మహిళా భద్రత చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, మహిళ భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఆపద సమయంలో వాటిని వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈసందర్భంగా నిర్వాహకులు సురేష్ మాథూర్ ఆమెకు జ్ఞాపికను అందజేసి సన్మానించారు.

## మధుర ఫలం.. విష తుల్యం

**నగరానికి భారీగా చేరుతున్న మామిడి దిగుమతి**

**పండ్లుగా మాగించేందుకు రసాయనాలు వాడుతున్న వ్యాపారులు**

**రహస్య గోదాముల్లో గుట్టుచప్పుడు కాకుండా నిల్వలు**

**చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు**



హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త: మామిడి పండ్లు పసుపురంగులో నిగనిగలాడుతుంటూ తొందరపడి కొనుగోలు చేయొద్దు. అవి కార్బైట్ రసాయనాలతో పండించినవా, లేకా సహజసిద్ధంగా పండినవా తెలుసుకుని కొనుగోలు చేయండి. ఆరోగ్యకరమైన పండ్లను కొందరు వ్యాపారులు లాభాపేక్షతో విషతుల్యం చేస్తున్నారు. రసాయనాలు, కార్బైట్ వంటివి ఉపయోగించి కృత్రిమంగా పండ్లను మగ్గిస్తున్నారు. ఇవి ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని శాస్త్రవేత్తలు హెచ్చరించడంతో ఈ విధానాన్ని ప్రభుత్వం నిషేధించింది. వ్యాపారులు రసాయనాలతో పండ్లను మగ్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది అయినా వారిలో మార్పు కనిపించడం లేదు. జాంబాగ్, సికింద్రాబాద్ మోంజా మార్కెట్‌లతోపాటు కొత్తపేట పాతమార్కెట్ సమీపంలోని కొన్ని గోదాముల్లో కొందరు వ్యాపారులు నిషేధిత రసాయనాలతో పండ్లను మగ్గిస్తున్నారు. అరటి, మామిడి, దానిమ్మ వంటి పండ్లను సహజ సిద్ధంగా మగ్గిస్తేనే రుచితోపాటు, శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లు అందిస్తాయి. కృత్రిమంగా మగ్గిస్తే వాటితోపాటు అనారోగ్యాలు వచ్చే ప్రమాదం ఉంది.

**మామిడి పండ్లే..** వేసవిలో పండ్ల మార్కెట్‌కు టన్నులకొద్దీ మామిడి దిగుమతి ఉంటుంది. సీజన్ కేవలం రెండు నెలలే ఉండటంతో వాటిని సహజ పద్ధతిలో మగ్గించడానికి సమయం పడుతుందని వ్యాపారులు కార్బైడ్, ఫౌడర్‌ను వినియోగిస్తున్నారు. పక్వానికి రాని పండ్ల మధ్య రసాయనాలు ఉంచడం వల్ల అవి తెల్లవారేసరికి మగ్గిపోతాయి. అటువంటి పండ్లు తినడం వల్ల ఆరోగ్యానికి చేటు అని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రసాయనాల వినియోగంపై ఫుడ్‌సేఫ్టీ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖ అధికారులు నిఘా పెట్టినా చాలామంది వ్యాపారులు శివారు ప్రాంతాల్లో తమకార్యకలాపాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

**రహస్య గోదాములు..** అతిపెద్ద పండ్ల మార్కెట్ అయిన గడ్డిఅన్నారం మార్కెట్ సైతం శివారు ప్రాంతానికి తరలించడంతో అక్కడ సమీప ప్రాంతాలతోపాటు, గతంలో గడ్డిఅన్నారం, చైతన్యపురి ప్రాంతాల్లో వినియోగించుకున్న గోదాంలలో తమ కార్యకలాపాలను యథావిధిగా కొనసాగిస్తున్నారు. అక్కడ కార్బైడ్‌తో మాగించిన తర్వాత సిటిలోని చిన్నచిన్న వ్యాపారులకు అమ్ముతున్నారు. ముఖ్యంగా చైనానుంచి దిగుమతి అయిన కార్బైట్‌ను గోదాముల్లో నిల్వచేస్తున్నారు. పండ్లను ఇక్కడికి తరలించడం లేదా కోరుకున్న వ్యాపారులకు వారి స్థావరాలకే రసాయన పౌడర్‌లను పంపిణీ చేస్తున్నారు. రెయిన్‌బజార్, మొఘల్‌పురా, మీర్‌చౌక్‌తోపాటు, హాయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, చర్లపల్లి, కాటేదాన్, పహాడీషరీఫ్ వంటి ప్రాంతాల్లో రహస్య గోదాముల్లో ఉన్నాయి.

## చెరువు బఫర్ జోన్‌లో వెలిసిన అక్రమ నిర్మాణాలు నేలమట్టం

**భారీ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేసిన హెచ్‌ఎండిఏ అధికారులు**

నార్సింగి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్‌నాంపూర్ పెద్ద చెరువు బఫర్ జోన్ వద్ద వెలిసిన అక్రమ నిర్మాణాలను బుధవారం హెచ్‌ఎండిఏ అధికారులు నేలమట్టం చేశారు. లేక్ వ్యూ విల్లాస్‌లో గతంలో కూడా అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేసినా, మళ్లీ సదరు కబ్జాదారులు నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న హెచ్‌ఎండిఏ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య అక్కడికి వచ్చి మూడు జేసీబీల సహాయంతో ఐదు విల్లాలను నేలమట్టం చేశారు. హెచ్‌ఎండిఏ, ఇరిగేషన్, మణికొండ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది ఈ కూల్చివేతలలో పాల్గొన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో టౌన్‌ప్లానింగ్ నిబంధనలు ఉల్లంఘించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని టిపిఓ రాకేష్ సింగ్ పేర్కొన్నారు. ముఖ్యంగా చెరువుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చిస్తుందని, అలాంటి చెరువుల బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలు చేపట్టడం పూర్తిగా చట్ట విరుద్ధమని తెలిపారు. ప్రజలు, బిల్డర్లు అందరూ నిబంధనలకు లోబడి ఇళ్లు నిర్మించుకోవాలని టిపిఓ సూచించారు.



మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్‌నాంపూర్ చెరువు పక్కన బఫర్ జోన్‌లో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూలుస్తున్న హెచ్‌ఎండిఏ అధికారులు

## సమస్యల పరిష్కారంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి తలసాని



మోండా డివిజన్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రజా సమస్యల పరిష్కారంపై వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, సినిమాటో గ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. బుధవారం సనత్ నగర్ నియోజకవర్గం మోండా డివిజన్‌లోని బండి మెట్టు, మారుతీ వీధి, సజన్‌లాల్ స్ట్రీట్ పరిసర ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లపై చెత్త వేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నూటికి నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి, ఇఇ.సుదర్శన్, వాటర్ వర్క్స్ జిఎం రమణారెడ్డి, తహశీల్దార్ శైలజా, బిఆర్‌ఎస్ నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, నాగులు, సత్య నారాయణ, జయరాజ్, అమర్, బాబులాల్, రాము పాల్గొన్నారు.

## లౌకిక ప్రజాస్వామ్యంపై బిజెపి, ఎంఐఎం దాడులు చేస్తున్నాయి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహా**

సైఫాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: బద్ధ శత్రువులుగా నటిస్తూ బిజెపి, ఎంఐఎంలు కలిసి దేశ లౌకిక ప్రజాస్వామ్యంపై ప్రమాదకరమైన దాడులు చేస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహా ఆరోపించారు. మెజార్టీ, మైనార్టీ మతతత్వం మనదేశానికి ముప్పుకలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ ఎదుట 'బిజెపి హటావ్-దేశ్ బచావ్' పాదయాత్ర ప్రచార హోర్డింగ్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బిజెపియేతర ఓట్లు ఒకేచోట చేరకుండా చూసుకోవడం ద్వారా బిజెపిని గెలిపించాలనే ఖచ్చితమైన లక్ష్యంతో ఎంఐఎం బిజెపి బి టీమ్‌గా వ్యవహరిస్తున్నదనేది బహిరంగ రహస్యం తప్పా మరొకటి కాదని స్పష్టం చేశారు. ఇరు పార్టీల మధ్య ఒప్పందం ఏమిటో దేశ ప్రజలకు బిజెపి తెలియజేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ఎదుగుదలతోపాటు ఎంఐఎం ఎదుగుదల కూడా దేశానికి ప్రమాదకరమని హెచ్చరించారు. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఈ నెల 14వ తేదీ నుంచి మే 15వరకు బిజెపి హటావ్-దేశ్ బచావ్ అనే నినాదాంతో పాదయాత్రలు జరుగుతాయని చెప్పారు. ఈ పాదయాత్రలను హైదరాబాద్ జిల్లా కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ హోర్డింగ్ ప్రారంభోత్సవంలో సిపిఐ నగర నాయకులు ఎస్.ఛాయాదేవి, స్టాలిన్, యాదగిరి, వెంకటేశం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



హోర్డింగ్‌ను ఆవిష్కరిస్తున్న ఇ.టి.నర్సింహా

## ఉద్యోగ హక్కు చట్టంను రాజ్యాంగబద్ధం చేయాలి

**25న రౌండ్ టేబుల్ సమావేశం**

సైఫాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: పాలమూరు అధ్యయన వేదిక అధ్వర్యంలో ఈ నెల 25న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉద్యోగ హక్కు చట్టంకు రాజ్యాంగబద్ధం చేయాలి, నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వారి భవిష్యత్తు కాపాడాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని వేదిక తెలిపింది. బుధవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.హరగోపాల్, కన్వీనర్ ఎం.రాఘవ చారి, కో-కన్వీనర్ కె.వెంకటేశ్వర్లు, ఎ.రాజేంద్రబాబు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో రోజురోజుకు నిరుద్యోగుల పరిస్థితులు దుర్భరంగా మారాయని అరకొర విద్యాఅవకాశాల మధ్య చదువుకున్న ఎందరో నిరుద్యోగులు దీనంగా బతుకులు గడుపుతున్నారని ఇది దేశ, రాష్ట్ర ప్రగతికి ఎంతమాత్రం మంచిదికాదని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పబ్లిక్ సర్వీస్ కమిషన్ రూపొందించిన యాప్‌లో 30 లక్షల మంది తమ పేర్లను నమోదు చసుకున్నారని, వీరి సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందని, దేశానికి స్వాతంత్ర్యం లభించి 75 సంవత్సరాలు రాజ్యాంగ నిర్దేశిత లక్ష్యాల మేరకు అసమానతల నివారణకు ఆస్తుల సహజవనరులు వికేంద్రీకరణకు అవసరమైన చర్యలు చేపట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని వారు ఆరోపించారు.

## ఘనంగా హజ్రత్ ఇమామ్ అలీ షహదత్ ఊరేగింపు



చార్మినార్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త : హజ్రత్ ఇమామ్ అలీ వర్ధంతి (షహదత్) సందర్భంగా బుధవారం హైదరాబాద్ పాతబస్తీలో షియా ముస్లింలు ఊరేగింపు నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసంలోని ఇరవై రోజున షియా ముస్లింలు పాతబస్తీలో షహదత్ ఊరేగింపును నిర్వహించటం ఆనవాయితీ. కాగా బుధవారం సాయంత్రం చార్మినార్ నుంచి ప్రారంభమైన ఊరేగింపు గుల్జారాహౌస్, మచిలీకమాన్, పంజేషా, మీరాలంమండి, దారుషిపా ప్రాంతాలు మీదుగా కాలీకబర్‌లోని ఇమామ్ మసీదు వరకు కొనసాగింది. పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన షియా ముస్లింలు పెద్ద ఎత్తున ఊరేగింపులో పాల్గొని మాతం నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్‌ను వేరే ప్రాంతాలు మీదుగా మళ్లించారు. ఈ సందర్భంగా పాతబస్తీలో దక్షిణ మండలం పోలీసులు పాతనగరంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

## గంజాయి విక్రయిస్తున్న నలుగురు అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఎసిపి చంద్రశేఖర్, నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న గంజాయి

మూసాపేట, ఏప్రిల్ 12, ప్రభాతవార్త : అక్రమంగా గంజాయి విక్రయించేందుకు సీలేరు ప్రాంతం నుండి గంజాయి తీసుకుని వచ్చిన నలుగురు నిందితులను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఏసీపీ చంద్రశేఖర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. గోదావరిఖని ప్రాంతానికి చెందిన మేకల అభిలాష్ (22), చల్లా దను(27), నిమ్మల మణికంఠ(21), మంథని ప్రాంతానికి చెందిన లింగం శ్రీపాదం(21)లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుండి 5.3 కేజీల గంజాయి, కారు, మూడు మొబైల్స్ సీజ్ చేసినట్లు తెలిపారు. ఏ1 నిందితుడిగా ఉన్న మేకల అభిలాష్‌పైన పీడీ యాక్టు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా కారు డిక్కీ భాగంలో గంజాయి తీసుకుని వెళ్తుండగా నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.



## కెసిఆర్ కిట్లను అందజేయడం అభినందనీయం

**డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు**



అడ్డగుట్టలో ముస్లిం మైనార్టీలకు రంజాన్ కానుకలను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్

అడ్డగుట్ట, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు పండుగలు సంతోషంగా ఉత్సాహంగా జరుపుకునేందుకు ముఖ్య మంత్రి కేసిఆర్ కిట్లను అందజేయడం అభినందనీయమని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు గౌడ్ తెలిపారు. బుధవారం అడ్డగుట్టలోని రెండు మజీద్‌లలో ముస్లిం మైనార్టీలకు రంజాన్ కానుకలను అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్‌తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్‌లింగాని శ్రీనివాస్, బిఆర్‌ఎస్ యువనేత రామేశ్వర్ గౌడ్, ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఎం.డి.ఇస్మయిల్, బిఆర్‌ఎస్ నాయకులు నక్క మధు, పెండెం మనోహర్, శ్రీనివాస్ గౌడ్,గీతా దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

**మాన్‌గరోడి బస్తీలో**

**రూ.60 లక్షలతో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు : పద్మారావు గౌడ్**

తుకారాంగేట్ మాన్‌గరోడి బస్తీలో శిథిలావస్థలో ప్రమాదానికి గురైన ఇండ్లు కూలి పలువురు పలువురు తీవ్ర గాయాలపాలు కావడంతో స్పందించిన పద్మారావు గౌడ్ ఘటన స్థలానికి చేరుకొని శిథిలావస్థలో ఉన్న ఇండ్లను తొలగించి స్థానికంగా నివాసం ఉంటున్న అర్హులైన లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ హామీ ఇచ్చారు. రెవెన్యూ, జిహెచ్‌ఎంసి హౌజింగ్ ఇంజనీర్లు కలిసిసి కో-ఆర్డినేషన్‌తో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మాజీ కార్పోరేటర్ నక్క మల్లీశ్వరీ దేవి, నక్క మధు ఇంటిలో అధికారులతో సమావేశమై డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ లింగాని ప్రసన్న మాన్‌గరోడి బస్తీనేతలు సనాదన్, మహేశ్, బిఆర్‌ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని వెంకటయ్య మృతిపట్ల సంతాపం

శామీర్‌పేట, ఏప్రిల్ 12, ప్రభాతవార్త : సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు,తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని వెంకటయ్య (98) మృతిపట్ల మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం ఆయ న మాట్లాడుతూ మాజీ ఎంపి, స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ సాయుధపోరాట యోధులు స్వర్గీయ బొమ్మగాని ధర్మబిక్షం సోదరుడు బొమ్మగాని వెంకటయ్య నగరంలో మృతిచెందినట్లు ఆయన తెలిపారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు

ఖైరతాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: బస్తీల, కాలనీల చౌరస్తాల, ప్రధానకూడళ్లలో, అదేవిధంగా ఖైరతాబాద్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలకు సర్వం సిద్ధం చేసుకున్నారు. ఇటు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో పాటు మరోవైపు అంబేద్కర్ అభిమానులు కూడా ముందే వరుసలో ఉంటున్నారు. ఈ విధంగా ఎక్కడ చూసినా అంబేద్కర్ చిత్ర పటాలు, విగ్రహాలతో హోరెత్తిస్తున్నారు. గతంలో కన్నా మరింత ఉద్ధృతం చేయాలన్న తపన అందరిలోనూ కనిపిస్తుంది. మరికొందరైతే ప్రముఖ రాజకీయవేత్తలను ఆహ్వానించనున్నట్లు తెలిసింది. అంగరంగ వైభవోపేతంగా జయంతి వేడుకలు జరుపుకోవాలని మరికొందరు సూచిస్తున్నారు.

## సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు: పి.విజయారెడ్డి

ఖైరతాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: ఖైరతాబాద్ నియోజకవర్గం పరిసర ప్రాంతాలలోని బస్తీలు, కాలనీలలో అధికశాతం ప్రజాసమస్యలపై దృష్టిసారించామని వాటి పరిష్కారం కోసం వారితో చర్చించడం జరిగిందని టి.పిసిసి ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ పి.విజయారెడ్డి పేర్కొన్నారు. హాత్ సె హాత్ జోడో పాదయాత్రలో భాగంగా విజయారెడ్డి పాదయాత్రను పార్టీ అగ్రనేతల సూచన మేరకు సాగిస్తున్నామంటున్నారు. ఎక్కడ చూసినా మహిళలు, యువత ముందుకు వచ్చి తమను స్వాగతిస్తున్నారని స్పష్టం చేస్తున్నారు. ఎక్కువగా మంచినీరు, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు, వీది దీపాలు, పారిశుధ్యం తదితర వంటి వాటిపై ఫోకస్ పెట్టినట్లుగా ఆమె అనుచరగణం చెబుతున్నారు. అంతటా అందరు పరిచయస్తులే తమకు మరింత సులువు మార్గంగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

## రంజాన్ బహుమతులు ప్రదానం



బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే

అల్వాల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: అన్ని వర్గాలు ప్రజలు సుఖ సంతోషాలుతో పండుగలను జరుపుకోవాలన్నది ప్రభుత్వ విధానమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. బుధవారం వెంకటాపురం డివిజన్ పరిధిలోని రాజీవ్‌నగర్ బస్తీలో ముస్లిం సోదరులకు రంజాన్ బహుమతులను స్థానిక కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్‌తో కలిసి ప్రధానం చేయడం జరిగింది. ఎమ్మెల్యేతో పాటుగా బిఆర్ఎస్ నేతలు ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలులో పాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అనీల్ కిషోర్ సయ్యద్ మోసిన్ ఇక్బాల్ మహ్మద్ ఫయాజ్ రఫీక్ రజాక్ అక్బర్ అస్లాం బాబా పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### కార్పొరేటర్ జితేందర్‌నాథ్



అధికారులతో కార్పొరేటర్

అల్వాల్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: విద్యుత్ సమస్యలు దరి చేరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలో లోఓల్టేజి ఇతర సమస్యలు ఉన్న ప్రాంతాలులో విద్యుత్ అధికారులుతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. నూతనంగా అనేక కాలనీలు ఆవిర్భవించిన నేపధ్యంలో పలు ప్రాంతాలులో విద్యుత్ సమస్యలు ఉన్నాయని ఆయన వివరించారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లు విద్యుత్ లైన్లు వేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. డిఇ సురేందర్ నాధ్ ఏడిఇ చారి ఎఇ భరత్ బిఆర్ఎస్ నేతలు శ్రీశైలం నాగరాజు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో రంజాన్ జరుపుకోవాలి



ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణి చేస్తున్న ఎమ్మెలే

హైదరాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బుధవారం కాచిగూడ డివిజన్‌లోని చెప్పల్ బజార్‌లో మస్తాన్ సహెబ్ మజీద్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముస్లింలకు రంజాన్ కానుకులను పంపిణి చేశారు. పవి త్రమైన రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ ఉమా రమేష్‌యాదవ్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## సమాజంలో విద్యా ఎంతో అవసరం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న పద్మశ్రీ అబ్దుల్ వహిద్

హైదరాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: గోల్నాక శ్రీవేంకటేశ్వర నగర్‌లో పేద, మధ్యతరగతి కుటుంబాల కోసం మోయిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ లెర్నింగ్ సెంటర్‌ను పద్మశ్రీ అవార్డు గ్రహీత మహమ్మద్ అబ్దుల్ వహిద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్య, డిజిటల్ లిటరసి ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు వీరయ్య, సురేష్ కుమారులు విద్యా శాఖాదికారి విజయలక్ష్మి, సెంటర్ నిర్వాహకులు సంపత్ శశిరాజ్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : లాస్య నందిత



5వ వార్డు సంజీవయ్య నగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న లాస్య నందిత తదితరులు

కంటోన్మెంట్,ఏప్రిల్ 12 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని దివంగత ఎమ్మెల్యే జి.సాయన్న కుమార్తె లాస్య నందిత తెలిపారు. బుధవారం 5వ వార్డులోని వాల్మీకి నగర్, సంజీవయ్య నగర్ వీకర్ సెక్షన్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పైప్‌లైన్లు వేసి మంటినీటి సమస్యను పరిష్కరించాలని, ఆయా ప్రాంతాల్లో ఉన్న కమ్యూనిటీ హాళ్లను మరింత అభివృద్ధిపర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె దృష్టికి తెచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను కంటోన్మెంట్ బోర్డు అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు బిఆర్ఎస్ అధ్యక్షులు కిరణ్ కుమార్,ప్రధాన కార్యదర్శి పెంట శ్రీహరి, బిఆర్ఎస్ నేతలు పనస సంతోష్ నాగినేని సరిత, నీరజ్, భాస్కర్ మురాజ్, బస్తీ నాయకులు రాజు, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు ఇస్కాన్ ఆధ్వర్యంలో గీత వేసవి శిక్షణా శిబిరం

సైఫాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: ఇస్కాన్ కుకట్‌పల్లి ఆధ్వర్యంలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నృత్యం, గానం, కళలు, నాటకాలు, క్రాఫ్ట్‌లు అన్నింటిక మించి అందరికి సేవ వివిధ కార్యకలాపాలపై పిల్లలకు గీత వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నామని ఆ సంస్థ తెలిపింది. ఈ మేరకు బుధవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇస్కాన్ కూకట్‌పల్లి కో-ఆర్డినేటర్లు శ్రీవాణి, సాధన భక్తిదాస్, భారతికృష్ణ, వెంకటేశ్వర్‌రావు తదితరులు మాట్లాడుతూ 6 నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలకు మన విలువలను పెంపొందించడానికి ఈ నెల 15 నుంచి 23 వరకు, ఏప్రిల్ 28 నుంచి మే 3వ తేదీ వరకు, మే 9 నుంచి 17 వరకు వరుసగా 3 వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. పిల్లలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి, సమగ్రాభివృద్ధి కోసం ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల జీవితాలలో వెలుగును చూసేందుకు ఈ శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

## 13గంటల్లో 151పాటలతో మూడు రికార్డులు కైవసం



కృష్ణవేణికి రికార్డులను అందజేస్తున్న దైవజ్ఞశర్మ, నరేందర్‌గౌడ్, పురుషోత్తం, సుభాషిణి తదితర అతిథులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త : శ్రీకృష్ణా ఆర్ట్స్ కల్చరల్ సంస్థను స్థాపించి 3వ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా తన 27వ కార్యక్రమంలో ప్రఖ్యాతగాయని కృష్ణవేణి ఒకే 13 గంటల్లో 151 పాటలను 30మంది గాయకులతో కలిసి నిర్విరామంగా 7భాషల్లో పాడి సినీసంగీత ప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులను సంగీతలోకంలో విహరింపజేసి విశ్వవ్యాప్తంగా ఖ్యాతిని పొందిన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను ఏకకాలంలో కనీవిని ఎరుగనిరీతిలో కైవసం చేసుకున్నారు. సంస్థ ఉపాధ్యక్షులు రవికుమార్, ప్రవీణల పర్యవేక్షణలో, శ్రీనివాస్ సహకారంతో మరు వలేని రికార్డును స్వాధీనం చేసుకోవడం హర్షదాయకమని సీటీకర్చలర్ అధినేత పురు షోత్తం కృష్ణవేణిని అభినందించారు. రికార్డు సంస్థల కోఆర్డినేటర్లు బింగి నరేందర్ గౌడ్, సుభాషిణిలు ఈ రికార్డులను, జ్ఞాపికలను ముఖ్యఅతిథి సరస్వతీ ఉపాసకుడు, ప్రముఖ సంఖ్యాశాస్త్రజ్ఞుడు దైవజ్ఞశర్మతో కలిసి కృష్ణవేణికి అందజేసి శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.మురళీధర్, నరేందర్‌గౌడ్, విజయలక్ష్మి, చింతపట్ల వెంకటాచారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రైటప్: గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

## ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 12, ప్రభాతవార్త : ఆది శంకరాచార్యులు జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం కెపిహెచ్‌బి కాలనీ 6వ ఫేస్‌లో జయంతి ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికను కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ నెల 21వ తేదీ నుండి 25వ తేదీ వరకు కెపిహెచ్‌బి కాలనీ 6వ ఫేస్‌లో గల విజయదుర్గా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు గోడపత్రికతో పాటు కరపత్రాలను, స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కెపిహెచ్‌బి కాలనీ డివిజన్ కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు శేఖర్‌రెడ్డి, కోదండ రామయ్య, రామారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ టోల్‌టాక్స్ రద్దుకు రక్షణ శాఖ ఆదేశాలు

కంటోన్మెంట్,ఏప్రిల్ 12 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోకి ప్రవేశించే కమర్షియల్ వాహనాలపై ఇక నుంచి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని కేంద్ర రక్షణ శాఖ ఆదేశాలు జారీ చేసింది. కంటోన్మెంట్‌లో ఉన్న టోల్ టాక్స్ చెక్‌పోస్టులను ఎత్తి వేయాలని గత సంవత్సరం క్రితమే కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే టోల్‌టాక్స్‌ను రద్దు చేస్తే బోర్డుకు ఆదాయం తగ్గడంతో సంవత్సరానికి దాదాపు 10 కోట్ల రూపాయలు నష్టం వస్తుందన్న ఉద్దేశ్యంతో కమర్షియల్ వాహానాలపై టోల్‌టాక్స్‌ను వసూల్ చేస్తున్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం టోల్ టాక్స్‌ను రద్దు చేయాలని రక్షణ శాఖ గెజిట్ విడుదల చేసింది. ఇక నుంచి కమర్షియల్ వాహనాల ఎంట్రీ ఫీజులను రద్దు చేయాలని రక్షణ శాఖ గెజిట్ విడుదల చేసింది. టోల్ టాక్స్ రద్దు చేయడం వల్ల కంటోన్మెంట్ బోర్డుకు సంవత్సరానికి 10 కోట్ల రూపాయలు నష్టం వాటిల్లుతుందని అధికారులు వ్యక్తం చేశారు.

## కార్వాన్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం



కార్వాన్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న సరిత

మెహిదీపట్నం, ఏప్రిల్ 12, ప్రభాతవార్త : నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే కార్వాన్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం తథ్యమని ఆపార్టీ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ, కార్వాన్ నియోజకవర్గ కన్వీనర్ సరిత అన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. బుధవారం కార్వాన్ నియోజకవర్గ ఏ-బ్లాక్ అధ్యక్షులు కూరాకుల క్రిష్ణ, బి-బ్లాక్ అధ్యక్షులు చంటిబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గ సమావేశాన్ని కార్వాన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో సరిత పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నటువంటి బిఆర్ఎస్ పార్టీ, స్థానిక మజ్లిస్ పార్టీలు కార్వాన్ ప్రజల సమస్యలను గాలికి వదిలేశారని ఆరోపించారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిందేనన్నారు. బిజెపి, బిఆర్ఎస్, మజ్లిస్ పార్టీలపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నసమయంలోనే కార్వాన్ అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని స్థానిక నాయకులకు సూచించారు. సమావేశంలో జీహెచ్ఎంసీ జనరల్ సెక్రెటరీలు ఆకుల చంద్రశేఖర్, గిరి నాయకులు వినోద్‌సింగ్, రామ్‌కుమార్, ప్రేమ్ కిషోర్, సంతోష్‌గౌడ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలి

### వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 12, ప్రభాతవార్త : తెలంగాణ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆదిమూల రాము ఆధ్వర్యంలో బుధవారం బాలానగర్ రాజు కాలనీలో బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 12 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి సీనియర్ నాయకులు, టిటిడి బోర్డు అడ్వైజరీ కమిటీ ఉపాధ్యక్షులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన సేవలను భారత జాతి మొత్తం స్మరించుకోవాలని గుర్తు చేశారు. బాబా సాహెబ్ ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి తెలంగాణ దళిత సంక్షేమ సంఘం సభ్యులు, బాలానగర్ డివిజన్ బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రెండవ విడత గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

### గొర్రెల, మేకల పెంపకందారుల అభివృద్ధి సమాఖ్య చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్

మెహిదీపట్నం, ఏప్రిల్ 12, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలో రెండవ విడత గొర్రెల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకందారుల అభివృద్ధి సమాఖ్య చైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ తెలిపారు. బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని గొర్రెల, మేకల డెవలప్‌మెంట్ ఫెడరేషన్ కార్యాలయంలో సంస్థ ఎండీ, ముఖ్య అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దూదిమెట్ల బాలరాజు యాదవ్ మాట్లాడుతూ..రెండవ విడత గొర్రెల పంపిణీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల 50 వేల గొర్రెల యూనిట్లను జిల్లాలలోని కలెక్టర్ల ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. 32 జిల్లాలో గొర్రెల యూనిట్ల రవాణా సరఫరా కోసం టెండర్ల ప్రక్రియ కొనసాగుతుందని, 3 లక్షల 50 వేల యూనిట్లకు కావాల్సిన 73 లక్షల 50 వేలు పంపిణీ చేసే గొర్రెలను అధికారులు గుర్తించామని తెలిపారు. జిల్లా అధికారుల నేతృత్వంలో లబ్దిదారుల డి.డి చెల్లింపులు, సర్టిఫికెట్ల సేకరణ, లబ్ధిదారులకు అవగాహన సదస్సులతో పాటు జిల్లాల వారిగా లబ్ధిదారుల సంఖ్యను, వారి వివరాలను ఈ-లాబ్ పోర్టల్‌లో పొందుపరచాలని ఆదేశించారు. రూ.6125 కోట్ల నిధుల కెటాయింపుతో రెండవ విడత గొర్రెల పంపిణీ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సంస్థ ఎండీ రామచంద్రం, డి.డి శ్రీనివాస్‌రావు, ఏ.డి.వెంకటయ్యగౌడ్, సాయిరాజ్‌లు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి రెండవ విడత గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించి ఏర్పాట్లు, విధి విధానాలు, అమలు చేయు ప్రక్రియ, రాష్ట్రంలో గొర్రెల పెంపకందారుల సమగ్ర అభివృద్ధికి చేపడుతున్న వివిధ పథకాల అమలును గురించి చర్చించడం జరిగింది.

# భారీ చోరీకి పన్నాగం

### గుట్టురట్టు చేసిన పోలీసులు
### జీడిమెట్ల పోలీసులను అభినందించిన సైబరాబాద్ సిపి



సైబారాబాద్ సిపి స్టీఫెన్‌రవింద్ర ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహిచి వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త భారీ దొంగతనానికి పథకం పన్నారు. దానికి తగట్టుగా తపాకులు, బుల్లెట్లు, జంబియ, పదునైన కత్తెర, ఇతర ఆర్థిక నేరాలకు పాల్పడే అన్ని వస్తువులతో గట్టి పథకమే వేశారు. ఇక దొంగతనం చేయటమే తరువాయి అనే తరుణంలో పోలీసులు చూసిన చొరవతో ఐదుగురు అంతరాష్ట్ర నేరగాళ్లు నగరంలో భారీ ఆర్థిక నేరాలకు పథకాన్ని గుట్టు రట్టు చేసి, అదుపులోకి తీసుకున్న సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. షాపూర్‌నగర్‌లోని ఆదర్శ్‌బ్యాంక్ రోడ్డులోని పాత ఇంట్లో ఐదుగురు సభ్యులుగల ముఠా ఉందని జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందిది. పోలీసులు పథకంపన్ని ఇంట్లో ఉన్నవారిని రహస్యంగా పరిశీలించగా గదిలో తుపాకులు, బుల్లెట్లు వున్నట్లు గుర్తించి రాత్రి, దాడిచేసి గదిలో ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా మహారాష్ట్రలోని పూనెలో ఆర్థిక నేరాలకు పాల్పడి అక్కడివుండి డబ్బుతో సహా పారిపోయి నగర శివారు జీడిమెట్లకు వచ్చి స్థానికంగా మరికొన్ని భారీ ఆర్థిక నేరాలకు పాల్పడాలనే దొంగతనాలకు పథకాలు రూపొందించినట్లు గుర్తించారు. వీరు వచ్చిన వెంటనే జీడిమెట్ల సమీపంలోని గుమ్మడిదలకు వెళ్లి ఒక కారును దొంగిలించి జీడిమెట్లకు వచ్చి భారీ నేరానికి రంగం సిద్ధం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఐదుగురు ముఠా సభ్యులు అమర్‌సింగ్ జగ్గర్‌సింగ్ టేక్(21) పూనే లోని ఏవత్‌హడ్డీకాగా, లక్కిసింగ్ అలియాస్ గబ్బర్‌సింగ్(20) పూనేలోని ఆనంద్‌నగర్‌లోని రామ్‌టేక్డీ నివాసి, నిహాల్‌సింగ్ అలియాస్ మానవ్‌సింగ్(17)పూనేలోని తుల్జా భవాణి వాసత్ నివాసికాగా, జీత్‌సింగ్ రాజ్‌పాల్ సింగ్ (22)పూనేలోని క్రిష్ణనగర్ నివాసిగా పోలీసులు గుర్తిం చారు. ఒక్కో నేరగాడి నేర చరిత్ర పరిశీలిస్తే పోలీసులే ఆశ్చర్యపోయేవిధంగా కరడుగట్టిన నేరస్తులుగా వుండటం షాక్‌కు గురిచేసింది. ఇందులో జీత్‌సింగ్ రాజ్‌పాల్ సింగ్ అనే నేరస్తుడు మహారాష్ట్రలో మొత్తం 47 నేరాలకు పాల్పడటమే కాక శారీరక నేరాలకు కూడా పాల్పడినట్లు గుర్తించారు. అమర్‌సింగ్ జాక్తార్‌సింగ్ తక్ అనే నేరస్థుడు 18 ఆర్థిక నేరాలతోపాటు శారీరాక నేరాలకు పాల్పడ్డాడు. లక్కిసింగ్ సబ్బర్‌సింగ్ అనే నేరస్తుడు సుమారు 40పైగా నేరాలతోపాటు శారీరక నేరాలతో సంబంధం వున్నట్లు గుర్తించారు. మరో నేరగాడు నిహాల్‌సింగ్ మానవ్‌సింగ్ సుమారు 40కి పైగా ఆస్తి, శారీరక నేరాలకు పాల్పడ్డట్లు పోలీసులు గుర్తించారు. వీరు మహారాష్ట్రలోని లోనావాల పోలీస్‌స్టేషన్, బాద్దాపూర్ పోలీస్‌స్టేషన్, హడప్సన్ పోలీస్‌స్టేషన్లలో మోస్ట్‌వాటెండ్ క్రిమినల్స్‌గా రికార్డుల్లో నమోదైనట్లు తెలిపారు. నిశాంత్‌సింగ్ అనే నేరస్తుడు 30 ఆర్థిక నేరాలలో వున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరివద్దనుండి మూడు దేశీయంగా తయారు చేసిన తుపాకులు, ఆరు రౌండ్ బుల్లెట్లు, 16 కత్తెర ముక్కలు,ఒక జామ్మియ, గ్రీన్‌కలర్ స్క్రూడ్రైవర్లు ఐదు, ఒక చిన్నలైటు, మూడు మంకీ కాప్స్, రెండు మెన్‌క్యాప్స్, ఒక కట్టర్, ఒక గునపం, టాటా ఇండికాకారు తో సహ మొత్తం రూ.లు.70వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. సకాలంలో సమాచారం అందటంతో నేరస్థులను అదుపులోకి తీసుకోవడంద్వారా నగరంలో భారీ నేరాన్ని అరికట్టడంతోపాటు నేరాలను అదుపుచేయటంలో పోలీసుల ముందుజాగ్రత్త చర్యలపై సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర జీడిమెట్ల పోలీసు అధికారులు, సిబ్బందిని పత్యేకంగా అభినందించారు. బాలానగర్ పోలీసు డిప్యుటీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సహయ పోలీసు కమిషనర్ ఎ.గం గారామ్, జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ పవన్, జీడిమెట్ల సబ్‌ఇన్‌స్పెక్టర్లు మన్మధ్‌కుమార్, ఆంజనేయులు, హరీష్, పోలీసులు పాల్గొన్నారు.

# స్థానిక సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి

### నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ అమృత తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త: స్థానిక సమస్యలపై అధికారులు దృష్టి సారించడం లేదని నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత అన్నారు. బుధవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ డెవలప్మెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ శ్యామ్‌రాజ్‌తో కలిసి ఆమె మాట్లాడారు. గత రెండు సంవత్సరాల నుంచి అధికారులకు ఎన్ని వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని స్థానిక అధికారులు అభివృద్ధి పనుల్లో ప్రోటోకాల్ పాటించడం లేదని మండిపడ్డారు. నల్లకుంట డివిజన్ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి తప్ప మరో అభివృద్ధి కనిపించడం లేదని కార్పొరేటర్లకు కనీస బడ్జెట్ కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత20సంవత్సరాల కింద వేసిన ఇనుప స్తంభాలు నేలకొరిగాయని, కొన్ని చోట్ల ఎర్తింగ్‌లు వస్తున్నా అధికారులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షులు రామ్‌రెడ్డి, సీనియర్ నాయకులు మధు యాదవ్, బాబు, లక్ష్మణ్, మహిళా మోర్చా కన్వీనర్ శిరీష, ఇర్ఫానా సుల్తాన్, తదితర నాయకులు పాల్గొన్నారు.

### మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధుల్లో
## నూతన ఆర్టీసీ బస్సు సర్వీసులను నడిపించాలి



ఆర్టీసి అధికారులతో నూతన బస్సుల సర్వీసులపై చర్చిస్తున్న మణికొండ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి

నార్సింగి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త : మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధుల్లో నూతన ఆర్టీసి బస్సుల సర్వీసులను నడిపిస్తే ఈ ప్రాంత ప్రజలకు చాలా సౌకర్యవంతంగా ఉంటుందని ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి ఆర్టీసి అధికారులను కోరారు. ఈ రెండు మున్సిపాలిటీలలో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు, చిరు వ్యాపారులు ప్రైవేటు ఆటోలలో వెళ్లలేక నడుచుకుంటూ వెళ్తున్నారని పేర్కొన్నారు. ఆర్టీసి బస్సులను నడిపితే సంస్థకు ఆదాయం వస్తుందని, కూలీలకు సౌకర్యవంతంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇందుకు స్పందించిన ఆర్టీసి అధికారి ధర్మేంద్ర మాట్లాడుతూ 47/వై.ఎం నెంబర్ బస్ మంచిరేవుల, నార్సింగి, పుప్పాలగూడ, మణికొండ, హుడా కాలనీ, బంజారాహిల్స్ మీదుగా సికింద్రాబాద్ వరకు నడుపుతున్నామని తెలిపారు. ప్రతీ రోజు 8.బస్సులు ఈ రూట్లలో మొత్తం 32.ట్రిప్పులు నడుస్తున్నాయని వివరించారు. ప్రజల వద్దకే ఆర్టీసి అనే నినాదంతో నూతన రూట్లలో ఆర్టీసి బస్సుల సర్వీసులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ విషయం స్థానిక ప్రజలకు తెలిసేలా స్థానిక ప్రజా ప్రతినిధులు కాలనీలు, బస్తీలలో అవగాహన కల్పించాలని కోరారు. ఆర్టీసికి ఆదాయం వచ్చేందుకు మావంతు పూర్తి సహకారం అందిస్తామని, నూతన సర్వీసులను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం తరువాత అన్ని విధాల మావంతు సహకారం అందిస్తామని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వసంత్‌రావ్ చౌహాన్, సీనియర్ నాయకులు లక్ష్మణ్‌రావ్, సంగెం శ్రీకాంత్, పుల్లారావ్, శ్రీనివాస్, ఆరిఫ్, మోహన్‌రావ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మైహోమ్ అవతార్ అధ్యక్షులు రవీంద్రచారి, గౌతంచారి, హాల్‌మార్క్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు శ్రీరాములు, బిఆర్ఎస్‌వి నియోజకవర్గ ఇంచార్జి శ్రవణ్ కుమార్ తదితరులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు.

## భవిష్యత్తు ఉద్యోగ ప్రణాళికల గురించి ప్రోత్సహించే కార్యక్రమాలను విరివిరిగా నిర్వహించాలి

### తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ విజ్జులత



ప్రొఫెసర్ విజ్జులతను సత్కరించిన దృశ్యం

హైదరాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: విద్యార్థులను భవిష్యత్తు ఉద్యోగ ప్రణాళికల గురించి ప్రోత్సహించే కార్యక్రమాలను విరివిగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ విజ్జులత అన్నారు. బుధవారం బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఫెస్ట్ పేరుతో ఝంకృత్-2కె23 కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై ప్రొఫెసర్ విజ్జులత ప్రారంభించి ప్రసంగించారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల సామూహిక గమనం, సామాజిక స్పృహ, సదవగాహనా సామర్థ్యం పెంపొందించుకోవడానికి దోహదపడతాయన్నారు. గౌరవ అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎ.పాత్రిక్ ప్రసంగిస్తూ విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహిస్తూ వ్యక్తిత్వ వృత్తిగతమైన నైపుణ్యాలను గురించి ప్రసంగించారు. అవంతి కళాశాలల డైరెక్టర్(హెచ్ఆర్) డాక్టర్ జయప్రద అతిథులను సత్కరించగా డైరెక్టర్ డాక్టర్ ఎ.వెంకటరావు, కామర్స్ విభాగాధిపతి సుగుణ తదితరులు పాల్గొన్నారు. జంటనగరాల డిగ్రీ కళాశాలలకు చెందిన చాలా మంది విద్యార్థినీ విద్యార్థులు వివిధ రకాల పోటీలలో పాల్గొని తమతమ నైపుణ్యాలను ప్రదర్శించారు.

## కొత్తపల్లిలో కంటి వెలుగు ప్రారంభం



**చౌడాపూర్ ఏప్రిల్12,ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ప్రారంభించారు.గ్రామ సర్పంచ్ నీరజా రెడ్డి ప్రారంభించి ప్రతి ఒక్కరూ కంటి వెలుగు సదుపాయాన్ని ఉపయోగించుకోవాలన్నారు.మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్ మాట్లాడుతూ... 18 సంవత్సరాములు పైబడిన వారందరూ ఆధార్ కారునడ తప్పనిసరిగా తీసుకొచ్చి కంటి పరీక్షలు చేసుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు వీరారెడ్డి,బ్రహ్మానంద రెడ్డి,వైద్య సిబ్బంది,బీచ్పల్లి గౌడ్,కళమ్మ,శరభ లింగం,పుష్పలత శకుంతల, కల్పన,పంచాయతీ కార్యదర్శి నరేష్,అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం

**చౌడాపూర్ ఏప్రిల్12,ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొత్తపల్లి తండాకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు లోక్యా నాయక్ గుండెపోటుతో మరణించాడు.ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే,జిల్లా డిసిసి అధ్యక్షుడు టి.రామ్మోహన్ రెడ్డి తెలుసుకొని అందుబాటులో లేకపోవడంతో స్థానిక మండల నాయకులచే బాధిత కుటుంబానికి 5వేల రూపాయలను ఆర్థిక సాయం అందించి అండగా ఉంటానని భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎ.అశోక్ కుమార్,జరుపల వెంకట్,కొత్తపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు అంజు నాయక్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు నూర్యా నాయక్, సంతోష్,గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## ఐవీఎఫ్ రాష్ట్ర యూత్ వింగ్ సెక్రెటరీగా సంతోష్ కుమార్



నియామకపత్రాన్ని అందుకుంటున్న రొంపల్లి సంతోష్‌కుమార్.

**తాండూరు, తాండూరు టౌన్ ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర యూత్ వింగ్ జనరల్ సెక్రెటరీగా తాండూరుకు చెందిన రొంపల్లి సంతోష్ కుమార్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం నాగోల్‌లో జరిగిని యూత్ వింగ్ సమావేశంలో ఐవీఎఫ్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఐవీఎఫ్ రాష్ట్ర యూత్ వింగ్ జనరల్ సెక్రెటరీగా రొంపల్లి సంతోష్ కుమార్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. తనను ఐవీఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులుగా, రాష్ట్ర యూత్ వింగ్ జనరల్ సెక్రెటరీగా నియమించడం పట్ల రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్తాకు కృతజ్ఞతలు తెలిపారు. మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ అందరికి అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పబ్బ చంద్రశేఖర్, యూత్ ప్రెసిడెంట్ కట్ట రవికుమార్ గుప్తా, వైస్ ప్రెసిడెంట్ నరేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి జూలకంటి అశోక్, వికారాబాద్ జిల్లా కోశాధికారి ఆగిరు మహేష్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ సిపిఆర్‌పై అవగాహన పెంచుకోవాలి

**-డిప్యూటీ డిఎంహెచ్‌ఓ ధరణి కుమార్**



సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డిప్యూటి డిఎంహెచ్ఓ డా॥ధరణి కుమార్

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** గుండె సంబంధిత సమస్యలు ఏర్పడి ఆపస్మారక స్థితిలోకి వెళ్లిన వారికి సిపిఆర్ ఎలా చేయాలనే అంశంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని అన్నారు.డివిజన్ పరిధిలోని దండు మైలారం,ఎలిమినేడు,ఇబ్రహీంపట్నం,మంచాల,ఆరుట్ల పిహెచ్‌సిలల్లోని డాక్టర్లకు, సూపర్వైజర్లకు, సిబ్బందికి, ఏఎన్ఎంలకు,ఆశాలకు బుదవారం సిపిఆర్–ఏఈడిపై ఎలిమినేడు పిహెచ్‌సి డా॥ప్రియాంక,యాచారం పిహెచ్‌సి డా॥ రాజ్యలక్ష్మిలు శిక్షణ ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా డిప్యూటి డిఎంహెచ్‌ఓ డా॥ధరణి కుమార్ మాట్లాడుతూ జంక్ ఫుడ్‌ల నుంచి దూరంగా ఉండి చిరుధాన్యాలతో మంచి రుచికరమైన ఆహార పదార్థాలను అలవాటు చేసుకోవడం ద్వార ఆరోగ్యాన్ని కాపాడు కోవచ్చున్నారు.గుండెపోటు వస్తే వెంటనే సిపిఆర్ ఎలా చేయాలో డెమో చేసి చూపించారు.కార్యక్రమంలో డాక్టర్లు పూనం,నాగయ్య, శ్రావన్‌రెడ్డి,కిరణ్,సరిత,సూపర్వైజర్లు,ఏఎన్ఎంలు,ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం

**-మాజీ డైరెక్టర్ ప్రభుకుమార్**

**పెద్దేముల్, ఏప్రిల్ 12,ప్రభాతవార్త:** తట్టెపల్లిని మండల కేంద్రంగా ప్రకటించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తట్టెపల్లి పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ ప్రభుకుమార్ హెచ్చరించారు. పెద్దేముల్ మండలంలోని తట్టెపల్లి చౌరాస్తాలో చేపట్టిన రిలే నిరాహరదీక్ష బుదవారంతో 7వ రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా ప్రభుకుమార్, యంపిటిసి శంకర్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు గోపాల్, నారాయన్‌గౌడ్ మాట్లాడుతూ అన్ని అర్హతలున్న తట్టెపల్లిని మండల కేంద్రంగా చేయవలసిందేనని తేల్చిచెప్పారు. పెద్దేముల్ మండలానికి వెళ్ళడానికి ఎన్నో వ్యయప్రయాసాలు ఒనర్చవలసి వస్తోందని, అందుకు తట్టెపల్లిని తప్పనిసరిగా మండల కేంద్రంగా చేయాలని డిమాండ్ చేశారు. 11 గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు తీర్మాణాలు చేసిన మండల ఏర్పాటులో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తట్టెపల్లిని మండల కేంద్రంగా వెంటనే ప్రకటించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రిలే నిరహార దీక్ష కోసం మండల సాధన సమితి సభ్యులకు మాజీ డైరెక్టర్ ప్రభుకుమార్ రూ.50 వేలు విరాళం అందజేశారు.ఈ కార్యక్రమంలో వెంకటేశం, జగన్, రతన్, సాబెర్, ఖయ్యుం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ డైరెక్టర్ ప్రభుకుమార్

# అంబేద్కర్ ఆలోచన విధానాన్ని అమలు చేస్తున్న కెసిఆర్

**-రాంపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ**

**-పాల్గొన్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,ఎమ్మెల్సీ కసిరెడ్డి,నారాయణ రెడ్డి,ఆచారి,చిత్తరంజన్ దాస్**



**తలకొండపల్లి ఏప్రిల్ 12,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ అమలు చేస్తున్నాడని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు.బుదవారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే జైపాల్ యాదవఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి,మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్,అంబేద్కర్ వాది జిలకర శ్రీను,జాతీయ కమిషన్ మాజీ సభ్యులు ఆచారిలు హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు.అంతకుముందు చంద్రన్న గ్రామం నుంచి కలాకారులు డప్పు వాయిదాలతో పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతూ అతిథులను ఆహ్వానించారు.అనంతరం జరిగిన కాకి కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కెసిఆర్ అంబేద్కర్ కలలు నేరవేర్చేందుకు ప్రపంచంలో ఎవరు ప్రశపెట్టని విధంగా అన్నగారిన వర్గాల అభివృద్ధి చెందేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు.దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు పేరుతో పది లక్షల రూపాయల ఇక సాయం చేసి వారి అభివృ ద్ధికి కృషి చేస్తున్నారన్నారు.కెసిఆర్ పాలనలో అన్నగారిన వర్గాల కోసం విద్యను ప్రవేశపెట్టేందుకు రాష్ట్రంలో 1090 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశానన్నాడు. దీంతో రాష్ట్రంలోని 3000ప్రైవేట్ పాఠశాలలు మూత పడినప్పటికి ప్రభుత్వం కృత నిచ్చేందుకు పేద ప్రజల మేలు కోసం గురుకుల పాఠశాలలో స్థాపించామన్నారు. రాష్ట్రంలో ఎన్నో ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి దేశంలోనే ఆదర్శవంతమైన పాలన కొనసాగుతుందని ఆయన అన్నారు.అనంతరం బిసి మాజీ కమిషన్ సభ్యులు ఆచారి మాట్లాడుతూ...అంబేద్కర్ జీవించిన రోజులో అనేక కష్టాలను అనుభవించి ఉన్నత చదువులు చదివాడన్నారు.ప్రస్తుతం ప్రతి ఒక్కరూ విద్యపై దృష్టి పెట్టి అందరూ చదువుకునేందుకు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్,ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ అంబేద్కర్ లిస్టు జిలకర శ్రీను,బిసి కమిషన్ జాతీయ మాజీ సభ్యులు టి.ఆచారి ,జడ్పిటిసి ఉప్పల వెంకటేష్,ఎంపిపి నిర్మల శ్రీశైలం గౌడ్,ఫౌండేషన్ నాయకులు వరప్రసాద్ రెడ్డి,అర్జున్ రెడ్డి,గుజ్జుల మహేష్,ప్రభాకర్ రెడ్డి,సర్పంచ్‌లు శ్యాంసుందర్ రెడ్డి,లలిత జ్యోతయ్య,ధరణి శివ శంకర్ రెడ్డి,కిష్టమ్మ,కుమార్,ఎంపిటిసిల సంఘం మండల అధ్యక్షుడు జోగు రమేష్, మాజీ ఎంపిపి లక్ష్మీదేవి,రఘురాములు,మాజీ సర్పంచ్ శ్రీనివాస చారి,ఉప సర్పంచ్ మోహన్ రెడ్డి,సుదర్శన్ రెడ్డి,కాకి వినోద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి మీ బిడ్డగా ఆశీర్వదించండి

**-తాండూరు ప్రాంత రూపురేఖలు మారుస్తా**

**-ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి**



పెద్దేముల్‌లో అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేస్తున్న ఎమ్మెల్యే

**పెద్దేముల్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** తనను ఎమ్మెల్యేగా చేసినందుకు అభివృద్ధి ఎందో చేసి చూపించానని, మరోసారి మీ బిడ్డగా ఆశీర్వదించి అవకాశం ఇస్తే తాండూరు ప్రాంత రూపురేఖలు మారుస్తానని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. పల్లెపల్లెకు పైలెట్ లో భాగంగా బుధవారం మండలంలోని కందనెల్లి, గాజీపూర్, బండపల్లి, బుద్దారం, పెద్దేముల్ తాండా, పెద్దేముల్, తింసాన్‌పల్లి, గోపాల్‌పూర్, నాగులపల్లి, నర్సాపూర్, రుద్రారం, జనగాం, మారెపల్లి గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంఖుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ గత పాలకులు అభివృద్ధిని మరిచి దొంగల్లా వచ్చి దొంగల్లా పారిపోయారని ఎద్దేవా చేశారు. ప్రతి గ్రామంలో దాదాపు 70 నుంచి 80 శాతము వరకు అభివృద్ధి పనులు జరిగాయని, మిగిలిన వాటిని కూడా అభివృద్ధి చేసి సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతామని అన్నారు. యువతకు, రైతులకు, మహిళలకు బిఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని గుర్తుచేశారు. సిఎం కెసిఆర్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి పలువురు బిఆర్ఎస్‌పార్టీ పట్ల ఆకర్శితులవుతున్నారని అన్నారు. తాండూరు ప్రాంతాన్ని జిల్లాలోనే ఆదర్శప్రాంతంగా తీర్చిదిద్దేందుకు తన శక్తి వంచన లేకుండా కృషిచేస్తానని అన్నారు. బుద్దారంలో ఆయా పార్టీలకు చెందిన యువకులు బిఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో యంపిటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్‌చారీ, యంపిపి అనురాధరమేష్, వైస్ యంపిపి మధులత శ్రీనివాస్,మండల బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, పెద్దేముల్ ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మెన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, యంపిటీసీల ఫోరం అధ్యక్షులు ధన్‌సింగ్,యంపిటిసి అంబరయ్య,సర్పంచ్‌లు రమేష్,వీరప్ప,ద్యావరి విజయమ్మ, రాములు, మట్ట బాగ్యలక్ష్మి నాయకులు రుక్మాపూర్ రమేష్, జితేందర్‌రెడ్డి,నరేష్‌రెడ్డి, శిబ్లి,డివై ప్రసాద్, సి.రంగయ్య,పి.శ్రీనివాస్‌రెడ్డి, మట్ట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వీర్లపల్లి శంకర్ ప్రవర్తనతో విసిగిపోయాం

**- కాంగ్రెస్ పార్టీ ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు ఆశన్నగౌడ్**

**- కాంగ్రెస్ పార్టీని వీడిన మండల అధ్యక్షుడు**

**రెండు గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆశన్నగౌడ్

**షాద్‌నగర్, ఏప్రిల్ 12, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ నియోకవర్గంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అనుసరిస్తున్న విధానాలతో పార్టీలో చాలా మంది నాయకులం, కార్యకర్తలం విసిగిపోయామని, అందుకే పార్టీని వీడాల్సి వస్తుందని ఫరూఖ్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆశన్నగౌడ్ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం మండల పరిధిలోని రాయికల్ సమీపంలోని హోటల్ 44లో ఆశన్నగౌడ్ ఎల్లంపల్లి సర్పంచి కిష్టయ్య, దేవునిపల్లి సర్పంచి రాఘవేందర్‌గౌడ్, దేవునిపల్లి ఉప సర్పంచి తదితరులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫరూఖ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆశన్నగౌడ్ మీడియాతో మాట్లాడుతూ... చాలా కాలంగా కాంగ్రెస్ కోసం పని చేశామని, గతంలో ఉన్న ఎమ్మెల్యేలతో కలిసి పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవలు చేశామని అన్నారు. అనంతరం వీర్లపల్లి శంకర్ వచ్చాక కూడా ఆయనతో కలిసి ఇప్పటి వరకు పనిచేశాము కాని ఇక మీదట చేయలేమనే ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. వీర్లపల్లి శంకర్ ప్రవర్తన వల్ల చాలా ఇబ్బందులు పడ్డామని, ఆయన ఒంటెద్దు పోకడ వల్ల పార్టీలో ఇమడలేకపోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో చాలా మంది నాయకులు, కార్యకర్తలు ఇలానే మదన పడుతున్నారని, ఎవరీని కదిలించినా ఇదే చెపుతున్నారన్నారు. త్వరలోనే మండలంలోని ఎల్లంపల్లి, దేవునిపల్లి, మీగతా గ్రామాలల్లో పలువురు నాయకులతో కలిసి సుమారు 500 మందికి తగ్గకుండా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నామని ఆయన విలేకరులకు వివరించారు. తమ రాజీనామాలను రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డికి పంపిస్తామని, కాంగ్రెస్ పార్టీ ఎంతో మంచి భవిష్యత్తును ఇచ్చినప్పటికీ వీర్లపల్లి శంకర్ దానిని వీర్లపల్లి శంకర్ దానిని నిలబెట్టుకోలేకపోయారని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో మరింత మంది నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడిపోవడం ఖాయమని ఆయన తెలిపారు. అదే విధంగా సర్పంచి చేగూరి రాఘవేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. తమ గ్రామాల అభివృద్ధి కోసమే తాము కాంగ్రెస్ పార్టీని వీడుతన్నామని, ఇంత కాలం పనిచేసిన కాంగ్రెస్ పార్టీని వీడటం చాలా బాధగా ఉందని అన్నారు. తమను నమ్మి ఓట్లు వేసిన ప్రజల కోసం, అభివృద్ధి కోసం ఈ త్యాగం చేయడం తప్పడం లేదని వారు ఆవేదనతో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపల్లి, దేవునిపల్లి, రాయికల్ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సహస్ర ఘటా నిషేచన కుంబాభిషేక క్రతువు మహోత్సవం

**-మూడు రోజులుగా పూజలందుకుంటున్న సురంగల్ కట్టమైమ్మ**



**మొయినాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండలంలోని సురంగల్ గ్రామంలో గత 48 రోజులు క్రీతం దేవాలయ నిర్మాణం పూర్తి చేసుకొని విగ్రహ ప్రతిష్టాపన కార్యాక్రమం జరిగింది, విగ్రహప్రతిష్టాపన నలభై ఎనిమిది రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామంలోని దేవాలయ కమిటి, మరియు గ్రామ పెద్దలు, పంచాయితి సభ్యులు, గ్రామస్థులంతా కలిసి కట్టమైసమ్మకు సహస్ర ఘటానిషేచన మహాభికుంబాభిషేక క్రతువు మహోత్సవము ఘనంగా నిర్వహించారు, గత మూడు రోజుల నుండి అమ్మవారికి నిత్యం యజ్ఞ, యాగాలతో నిత్యం పూజలందుకుంది, నిత్యం గ్రామస్థులు, మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు, అమ్మవారి పూజా కార్యాక్రమానికి వచ్చిన భక్తులకు నిత్యం అన్నధానం కార్యాక్రమం నిర్వహించారు, భక్తుల రద్దితో కన్నుల పండుగను తలపించింది, మూడురోజులు గ్రామస్థులు భక్తిశ్రద్దలతో అమ్మవారిని దర్శించుకున్నారు, 14 మంది వేదపండితుల బృదంతో, వేదమంత్రాలతో కట్టమైసమ్మ దేవాలయం పరిసర ప్రాంతం మారుమోగింది, గుడి గోపూరానికి కళభిషేకం నిర్వహించారు, నిత్యపూజల కార్యాక్రమంలో గ్రామస్థులు, వివిధప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు, ఈ కార్యాక్రమంలో ఆదాయపన్ను శాఖ మాజి అధికారి రాములు, సూదిన జైపాల్‌రెడ్డి, మాజి సర్పంచ్ రామచెంద్రయ్య, మాజి ఎంపీటిసి ఈగ రమాదేవి రాజు, నాయకులు నర్సింహారెడ్డి, మల్లేష్, గౌడ్, మాజి సర్పంచ్ లావణ్య భాస్కరచారి, వెంకట్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, నిర్దుల మహేందర్ రెడ్డి, గడ్డం మహేందర్ రెడ్డి, గుమ్మాల సీతారాం రెడ్డి, మాజి సర్పంచ్ బద్రప్ప లావణ్య, శ్రీనివాస్ రెడ్డి, గౌతమ్ రెడ్డి, వార్డు మెంబర్లు సుప్రియ, జయప్రధ, మాధవి, ఇంద్రమ్మ, భాస్కర్, విగ్రమ్‌రెడ్డి, నారాయణరెడ్డి, యాదగిరి యాదవ్, ఎల్గని అశోక్ గౌడ్, మాధవ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, కమ్మరి యాదగిరి చారి, బోర్ర సందీప్, బాల్‌రాజ్ గ్రామ పెద్దలు తధితరులు పాల్గొన్నారు.

## అన్యాక్రాంతమవుతున్న అసైన్‌మెంట్ భూములను పేదలకు పంచాలి

**: ఎంపిటిసి నాగమణి విఠలయ్య**

**పూడూరు, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** అన్యాక్రాంతమవుతున్న అసైన్‌మెంట్ భూములను స్వాదీనం చేసుకొని పేద ప్రజలకు పంపిణీ చేయాలని ఎంపిటిసి బండల నాగమణి విఠలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు స్థానిక తాహశీల్దారుకు పిర్యాదు చేసినట్లు బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎంపిటిసి మాట్లాడుతూ పూడూరు మండలం పరిధిలోని అంగడి చిట్టంపల్లి గ్రామానికి చెందిన 79,212 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూములలో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండ తారు,మట్టి రోడ్లను నిర్మించి ఆ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని ఆరోపించారు.అక్కడక్కడ అసైన్‌మెంట్ ల్యాండ్ ఆక్రమణకు గురైనట్లు వివరించారు.ఎకడినుండో వచ్చి ఇక్కడ భూములు కొనుగోలు చేసిన వ్యక్తులకు కొందరు దళారీలు తోడవ్వడంతో ఆ పొలాల్లోకి వెళ్లేందుకు ఎక్కడ పడితే అక్కడ ప్రభుత్వ భూములగుండా రోడ్లు వేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.ఈ రోడ్లు నిర్మించడం వల్ల గ్రామ పంచాయతీకిగాని,ప్రభుత్వానికి గాని ఎలాంటి ఉపయోగం లేదని వివరించారు.ఇటి భూమిని ప్రభుత్వం సర్వేచేయించి,స్వాదీన పరుచుకొని భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని ఆయన కోరారు.

## మే 1 నుండి 12 వరకు స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** స్పోర్ట్స్ అథారిటి ఆఫ్ తెలంగాణ వారి ద్వారా స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్ మే 1వ తేది నుండి మే 13 వరకు జిల్లాలో పది కేంద్రాల్లో వివిధ క్రీడాంశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు,కోచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించబడునని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉచితగాను,పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేకమైన రుసుముంతో శిక్షణ నిర్వహించబడును,ఈ శిక్షణా కార్యక్రమం ఉదయం 6 గంటల నుండి 9వరకు మరియు సాయంత్రం 4గంటల నుండి 7 గంటల వరకు నిర్వహించవలసి ఉంటుంది.14 సంవత్సరాలలోపు బాల బాలికలు, ఈ శిక్షణలో పాల్గొనుటకు అర్హులు,ప్రభుత్వ విధి విధానాలకి అనుగుణంగా వేసవి శిక్షణ శిబిరం నిర్వహించినటువంటి శిక్షకులకు రూ.4వేల గౌరవ వేతనం ఇవ్వబడుతుంది.ఈ శిక్షణ కేంద్రాలను నిర్వహింపదలచిన ఆసక్తి, అనుభవము కలిగిన శిక్షకులు,వ్యాయామ ఉపాధ్యాయులు మరియు క్రీడా సంఘాలకు చెందినటువంటి వారు ఈనెల 20లోగా జిల్లా యువజన మరియు క్రీడల అధికారికి వారి యొక్క పూర్తి వివరాములు, ధ్రువప త్రములు,శిక్షణ ఇచ్చే క్రీడాంశము,స్థలం,శిక్షణ ఇవ్వబోయే పిల్లల సంఖ్య, వివరాములతో దరఖాస్తూ చేసుకోగలరని తెలిపారు.సంప్రదించాల్సిన చిరునామా జిల్లా యువజన మరియు క్రీడల అధికారి,రూమ్ నెంబర్ 15,సెకండ్ ఫ్లోర్, కలెక్టరేట్ వికారాబాద్ ఫోన్ నెం 9676638201

## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ



ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

**వికారాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం పక్కన గల ఈవీఎం గోడౌన్‌ను జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్‌పు తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులు పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అదనపు కలెక్టర్ వెంట వికారాబాద్ తహసీల్దార్ వహీదా ఖాతూన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు రవీందర్ దత్తు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శంషాబాద్ ముదిరాజ్ సంఘం భవన్ నిర్మాణానికి 50లక్షలు మంజూరు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

**శంషాబాద్ ఏప్రిల్12,ప్రభాతవార్త :** శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు సిద్ధాంతి బస్తీలో నిర్మిస్తున్న ముదిరాజ్ భవనానికి 50లక్షల రూపాయలు మంజూరు ఇస్తున్నట్లు రాజేందర్ నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రకటించారు.ప్రకాష్ గౌడ్ నిర్ణయాన్ని స్వాగతిస్తూ స్థానిక కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్ జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బైరమోని మల్లేష్ ముదిరాజ్ ఆయనను సన్మానించారు.సిద్ధాంతి బస్తి వద్ద నిర్మాణంలో ఉన్న ముదిరాజ్ సంఘం అనేక సంవత్సరాల నుండి అసంపూర్తిగా ఉండడంతో దానిని పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరుతూ వస్తున్నారు.ఈ నేపథ్యంలో ముదిరాజ్ భవన నిర్మాణానికి 50లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంతో స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.మున్సిపల్ చైర్‌పర్సన్ కొలను సుష్మమహేందర్ రెడ్డి,వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్,స్థానిక కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్,జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బైరమోని మల్లేష్ ముదిరాజ్,శంషాబాద్ మండల శాఖ అధ్యక్షుడు మెరుగు సురేష్ ముదిరాజ్,సంఘం నాయకులు బొబ్బిలి కృష్ణయ్య,జేఆర్ శంకర్,వీరమల్ల హనుమంతు,బండి రమేష్ ముదిరాజ్,యాదగిరి,బొబ్బిలి శ్రీనివాస్,సిద్దులు,బండి సురేష్,మెరుగు రాజశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## బలగం నటీనటులకు సన్మానం

**శంషాబాద్ ఏప్రిల్12,ప్రభాతవార్త :** తెలంగాణ ప్రజలను కంటతడి పెట్టిస్తున్న బలగం సినిమా నటినటులను శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్వాల్ గూడ గ్రామంలో ఘనంగా సన్మానించారు.మున్సిపల్ కౌన్సిలర్ పగడాల లక్ష్మీ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ వార్డు కార్యాలయం వద్ద గ్రామస్తుల కోసం బలగం సినిమా స్క్రీన్‌పై ప్రదర్శించారు.ఈ సందర్భంగా బలగం సినిమాలో నటించిన పోతుగంటి సహదేవ్,సంజయ్,సత్యనారాయణ,లక్ష్మీ,తదితరులు ప్రేక్షకులతో కలిసి కొద్దిసేపు ఈ సినిమాను తిలకించారు.ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన నటీనటుల బృందాన్ని కౌన్సిలర్ లక్ష్మీ శ్రీనివాస్ గౌడ్ సింగిల్ విండో వైస్ చైర్మన్ జ్ఞానేశ్వర్ యాదవ్,కృష్ణ ముదిరాజ్,పగడాల సిద్ధేశ్వర్,రాజేశ్,స్థానిక నాయకులు వారిని శాలువా పూలమాలలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా లక్ష్మీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ....గ్రామీణ ప్రాంతాల్లోని సంఘటనలను కళ్లకు కట్టినట్టు చిత్రీకరించిన బలగం సినిమా అందరిని ఆకట్టుకుంటూ కంటతడి పెట్టిస్తున్నదని ఇలాంటి మంచి సినిమాలు నోటికో కోటికో ఒకటి వస్తుంటాయని వాటిని ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని తెలిపారు.ఇందులో నటించిన సహాయ నటులను సన్మానించే అవకాశం లభించడం మనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు.సహదేవ్‌తో పాటు పలువురు నటులు మాట్లాడుతూ...దిల్ రాజు తమకు మంచి అవకాశాన్ని కల్పించి మాలో ఉన్న ప్రతిభను మెరుగులు దిద్దారని ఆయన ప్రోత్సహాన్ని ఎన్నటికి మరవలేమని అన్నారు.

## విద్యార్థులు చదువుకు దూరం కాకూడదు

**-చైల్డ్‌లైన్ ప్రతినిధి రాంచంద్రయ్య**



**చౌడాపూర్ ఏప్రిల్12,ప్రభాతవార్త :** మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో విద్యార్థులు కొందరు కొంతకాలంగా బడికి రాకుండా దూరమయ్యారని తెలుసుకొని చైల్డ్‌లైన్ సంస్థ రామచంద్రయ్య ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను పాఠశాలలో చేర్పించి వార్షిక పరీక్షలు రాయించారు.తల్లిదండ్రులు వారి పిల్లలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని,ఎవరైన సమస్యలు పరిష్కారానికి 1098 నెంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమలత,సిఆర్‌పి విజయ్ ,ఉపాధ్యాయులు,విద్యార్థు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ



**బషీరాబాద్,ఏప్రిల్ 12,ప్రభాతవార్త:** అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కోసం మంగళవారం నాడు మైల్వార్ ఉపసర్పంచ్ యాస్మిన్ బేగం భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజు యాదవ్,రాజు ముదిరాజ్,అనిల్,వినోద్,పిఎసిఎస్ డైరెక్టర్ హన్మంత్ రెడ్డి,అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు అంబదాస్, వెంకట్,శివ,శ్రీకాంత్,శాను,సంతోష్,శివ తదితరులు పాల్గొన్నారు.

## కానరాని చలివేంద్రాలు

**బషీరాబాద్,ఏప్రిల్ 12,ప్రభాతవార్త:** ప్రజల గొంతు తడపటంలో ప్రజాప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు విఫలం అయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు.మండల కేంద్రంలో చలివేంద్రం (తాగునీటి కేంద్రం) ఏర్పాటు చేయటంలో విఫలం అయ్యారని మండల ప్రజలు పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా పలనాధికారి నారాయణ రెడ్డి. వేసవికాలం ప్రారంభానికి ముందు క్రిందిస్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని క్రిందిస్థాయి అధికారులకు ఆదేశించారు.బషీరాబాద్ మండల పరిధిలోని 36 గ్రామాల నుండి ప్రజలు ప్రతిరోజు మండలకేంద్రానికి రాకపోకలు చేస్తుంటారు.వేసవికాలం ప్రారంభం అయి రోజులు గడుస్తున్నా అధికారులు,నాయకులు ఒక చలివేంద్రం ఏర్పాటు చేయకపోవటంతో నీటికోసం నానా ఇబ్బందులు ఎదుర్కొని డబ్బులు ఇచ్చి నీరు కొని తాగాల్సి వస్తుందన్నారు.ఇప్పటికైనా అధికారులు నాయకులు మంచి మనస్సుతో ఉచిత తాగు నీటి కేంద్రాన్ని ప్రారంభించి పుణ్యం కట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఐమాక్స్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

**కొడంగల్ రూరల్, ఏప్రిల్ 12 (ప్రభాతవార్త) :** మున్సిపాలిటి పరిధిలోని 2వ వార్డులో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి బుధవారం కౌన్సిలర్ మధుయాదవ్‌తో కలిసి ఐమాక్స్ లైట్లను ప్రారంభించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన మార్కెట్ యార్డులో వ్యాపారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఐమాక్స్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే